క్లుప్తంగా

ఎన్‌సీసీ విద్యార్థులకు ఉపకార వేతనాలు



క్యాడెట్లను అభినందిస్తున్న ప్రసూన్‌కుమార్ పాండా

ఆమదాలవలస: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రశాంత్‌కుమార్, దిలీప్, ఢిల్లేశ్వరి, శ్రీమణిలు సీడబ్ల్యూఎస్ స్కాలర్‌షిప్‌లకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కె.ఎ.రాములు తెలిపారు. ఈ మేరకు క్యాడెట్లను శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కొక్కరికీ రూ.6వేలు చొప్పున స్కాలర్‌షిప్ అందనుందని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు పి.మోహనరావు, శరత్‌కుమారి, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధుల బాగోగులపై ఆరా



వృద్ధులతో మాట్లాడుతున్న సివిల్ జడ్జి వాణి

నరసన్నపేట: వృద్ధులకు అందుతున్న సేవలు, వారి ఆరోగ్య పరిస్థితులపై నరసన్నపేట సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్ ఎస్.వాణి ఆరా తీశారు. ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవం సందర్భంగా గొట్టిపల్లి తపోవన వృద్ధాశ్రమాన్ని శుక్రవార సందర్శించారు. వృద్ధులతో మాట్లాడి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. యోగా చేయడం అలవరచుకోవాలని కోరారు. అనంతరం పండ్లు, రొట్టెలు, ఔషధాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రావాడ కొండలరావు, కార్యదర్శి జి.వెంకటరావు, సహాయ కార్యదర్శి నర్సింగరావు, న్యాయవాదులు గొండు సత్యం, రోణంకి కృష్ణనాయుడు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



రొట్టవలసలో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

సరుబుజ్జిలి/ఆమదాలవలస: రైతన్నల సంక్షేమమే ధ్యేయమని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. రొట్టవలస రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బొడ్డేపల్లి పద్మనాభం, డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, తాడేల రాజారావు, తాడేల రమణ, సిద్ధార్థ, లక్ష్మీగోవిందరావు, రాంబాబు పాల్గొన్నారు.

ఆమదాలవలస: రాష్ట్రంలో 6.50 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనలో భాగంగా విదేశీయులు కంపెనీల ఏర్పాటుకు ముందుకు వచ్చారని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. కూటమి ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఆమదాలవలసలోని పార్టీ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

నరసన్నపేట వ్యవసాయాధికారిగా సూర్యకుమారి



నరసన్నపేట: మండల వ్యవసాయాధికారిగా వై.సూర్యకుమారి నియమితులయ్యారు. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా ట్రెనింగ్ కేంద్రంలో ఏఓగా పనిచేస్తున్న సూర్యకుమారి బదిలీపై నరసన్నపేట వచ్చారు. ఇప్పటి వరకూ ఏఓగా పనిచేసిన కె.సునీత జిల్లా వ్యవసాయ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

ఎండీఎం మెనూ పక్కాగా పాటించండి



కోరాడలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో రాంబాబు

హిరమండలం: మధ్యాహ్న భోజన పథకంలో పక్కాగా మెనూ పాటించాలని ఎంఈవో రాంబాబు సూచించారు. శుక్రవారం కోరాడ ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యాబోధన, తరగతుల నిర్వాహణపై ఆరాతీశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ పాటించాలని నిర్వాహకులను ఆదేశించారు. సన్న బియ్యంతో ఆహారం వండి పెట్టాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే!



నరసన్నపేట పంచాయతీ కార్యాలయం ఎదురుగా రోడ్డుపై వర్షం నీరు

- నరసన్నపేటలో కాలువలను తలపిస్తున్న ప్రధాన రోడ్లు
- అస్తవ్యస్తంగా డ్రైనేజీలు
- రూ.కోట్లు వెచ్చిస్తున్నా ఫలితం శూన్యం



కలివరపుపేటలో చేరిన వర్షం నీరు

నరసన్నపేట: చిన్నపాటి వర్షం వస్తే చాలు నియోజకవర్గ కేంద్రం నరసన్నపేట పట్టణంలోని రోడ్లన్నీ కాలువలను తలపిస్తున్నాయి. వర్షం నీటితో రోడ్లు నిండిపోతున్నాయి. దీంతో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నా కష్టాలు మాత్రం తప్పడం లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.15 కోట్లు వెచ్చించి భూగర్భ డ్రైనేజీ నిర్మించారు. మెయిన్ రోడ్డుకు రెండు వైపులా ఆర్‌అండ్‌బీ శాఖ రెండు దఫాలుగా రూ.5 కోట్లు మేర ఖర్చు చేసింది. పంచాయతీ నిధులు, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఆర్థిక సంఘాల నిధులు మరో రూ.నాలుగైదు కోట్లు కాలువల నిర్మాణానికి వెచ్చించారు. ఇలా కోట్లు కుమ్మరిస్తున్నా ఫలితం మాత్రం అంతంతగానే ఉంటోంది.

డంపింగ్ యార్డులుగా డ్రైన్లు..

కొద్దిపాటి వర్షమొచ్చినా వీధిలోని నీరంతా కాలువలో ప్రవహించకుండా రోడ్లపైనే నిలిచిపోతోంది. ఇక మెయిన్ రోడ్డు పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. ఆర్‌అండ్‌బీ శాఖ రెండు విడతలుగా పదేళ్ల కాలంలో రూ.5 కోట్లు వెచ్చించి రోడ్డుకు రెండు వైపులా కాలువలను నిర్మించింది. వర్షం వస్తే మాత్రం నీరంతా రోడ్డుపైనే నిలిచిపోతుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. దీనికి తోడు కాలువలను సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో ఆర్‌అండ్‌బీ డ్రైన్లు డంపింగ్ యార్డులుగా మారాయి. వర్షం వచ్చినప్పుడు చెత్త చెదారం రోడ్డుపైకి వచ్చి దుర్గంధాన్ని తలపిస్తోంది. ఓవైపు జిల్లాలో ప్రధాన వ్యాపార కేంద్రంగా నరసన్నపేట దినదినాభివృద్ధి సాధిస్తున్నా డ్రైనేజీ వ్యవస్థ మాత్రం అధ్వానంగా మారుతోంది. ప్రధానంగా మఠం వీధి, కోవెల వీధి, పుండరీ కాక్ష కాలనీ, బొడ్డవలస, బజారు వీధుల్లో వద్ద వర్షం నీరు ప్రవాహంగా మారుతోంది. కలివరపుపేట, శివనగర్ కాలనీ, లక్ష్మీనగర్, మారుతీనగర్ -1 తదితర వీధుల్లో నీరు నిలిచిపోయి దోమలకు నిలయంగా మారుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి సమస్య నుంచి గట్టెక్కించాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి..



గతంలో భూగర్భ డ్రైనేజీ నిర్మించినప్పుడు సరైన చర్యలు తీసుకోలేదు. ఎక్కడ నీరు అక్కడే కాలువల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటే ఈ పరిస్థితి ఉండేదికాదు. వీధుల్లో నీరంతా టౌన్‌లోనికి బజారు వైపు వస్తోంది. వైఎస్సార్ సీపీ పాలనలో బజారు నుంచి వెంకటేశ్వరాలయం మీదుగా ఒక డ్రైన్ కట్టడంతో కొంత వరకూ సమస్య పరిష్కారమైంది.

– గనగళ్ల శ్రీను, బజారువీధి, నరసన్నపేట

శుభ్రం చేయిస్తున్నాం..



డ్రైన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నాం. మెయిన్ రోడ్డులో కొన్ని చోట్ల పలకలు లేకపోవడంతో స్థానికులు చెత్తనంతా కాలువల్లో పడేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారులు సహకరించడం లేదు. దీంతో కొంత సమస్యగా ఉంది. పంచాయతీ సిబ్బందికి కూడా తగు సూచనలు చేసి వర్షం నీరు డ్రైన్లలోనికి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నాం.

– దాక్షాయిని, ఈఓ ,నరసన్నపేట



వడ్డినవలస-కొమనాపల్లి రహదారిపై గోతుల్లో నిలిచిన నీరు

రహదారులిలా..
రాకపోకలెలా?



అధ్వానంగా దూసి-కొత్తవలస రహదారి



పొన్నాంపేట వద్ద రహదారి దుస్థితి

తాము అధికారంలోకి వస్తే రహదారులను అద్దాలుగా తీర్చిదిద్దుతామని కూటమి నాయకులు ప్రగల్భాలు పలికారు. తీరా గద్దెనెక్కాక హామీని గాల్లో కలిపేశారు. సంక్రాంతి ముందు కొన్నిచోట్ల మాత్రమే హడావుడిగా పనులు చేసి చేతులు దులుపేసుకున్నారు. దీంతో గ్రామీణ రహదారులు గోతులమయంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరడంతో రాకపోకలకు వాహనచోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఆమదాలవలస మండలంలో దూసి-కొత్తవలస, సరుబుజ్జిలి మండలంలో రొట్టవలస-పురుషోత్తపురం, సారవకోట మండలంలో వడ్డినవలస-కొమనాపల్లికి వెళ్లే రహదారులు అధ్వానంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారుల సమస్యలు పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– ఆమదాలవలస రూరల్/సరుబుజ్జిలి, సారవకోట

నరసన్నపేట అభివృద్ధిలో బాబ్జీ పాత్ర కీలకం



బాబ్జీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేట అభివృద్ధిలో మాజీ సర్పంచ్ టంకాల బాబ్జీ పాత్ర ఎనలేనిదని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. బాబ్జీ 87వ జయంతి, 9వ వర్ధంతి సందర్భంగా గోరువానిచెరువు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి శుక్రవారం పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. పట్టణంలో ఆయన నిలువెత్తు విగ్రహం ఏర్పాటు చేయాలని అభిమానులు కోరగా.. అందరి సహకారంతో ఏర్పాటు చేద్దామని హామీనిచ్చారు.

కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, వైఎస్సార్ సీపీ ఇంటెలెక్చువల్ నియోజకవర్గ కన్వీనర్ సదాశివుని కృష్ణ, ఉప్పు లింగరాజు, చింతు రామారావు, కేసీహెచ్‌బీ గుప్త, ధర్మాన జగన్, నేతింటి రాజేశ్వరరావు, బీఎల్ శర్మ, ఇట్రాజు సూరిబాబు , పాట్నూరు నీలం, బి.రాజశేఖర్, టంకాల గౌతం, ఎస్‌వీసీటీ సిబ్బంది పాల్గొన్నారు.

విమాన ప్రమాద మృతులకు సంతాపం

నరసన్నపేట: అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఘోర విమాన ప్రమాదం చాలా దురదృష్టకరమని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం విమాన ప్రమాద మృతులకు సంతాపం వ్యక్తం చేసి మౌనం పాటించారు. ఆయన మాట్లాడుతూ విమానం ఒక మెడికల్ కళాశాల డార్మిటరీపై కూలడంతో మరింతగా ప్రాణ నష్టం జరిగిందని అన్నారు. మున్ముందు ఇలాంటి ప్రమాదాలు జరగకుండా మరింత కట్టుదిట్టంగా విమానయాన సంస్థ చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, సర్పంచ్ బూరల్లి శంకర్‌లతో పాటు పార్టీ నాయకులు చింతు రామారావు, కేసీహెచ్‌బీ గుప్త, తంగుడు జోగారావు, ధర్మాన జగన్, రాజాపు అప్పన్న, సురంగి నర్సింగరావు, బొబ్బాది ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పూడికలు తొలగించాలని వినతి

సారవకోట: మండల కేంద్రం సారవకోటలోని పలు చెరువుల్లో పూడికలు తొలగించాలని జనసేన నాయకుడు బచ్చల పృథ్వీ శుక్రవారం ఎంపీడీఓ మోహన్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. శివ రామపాత్రుని మంచినీటి కోనేరు పూడికలతో నిండి వినియోగానికి పనికి రాకుండాపోయిందని పేర్కొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

హిరమండలం: జగన్నాథపురంలో భూ సమస్యలు పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. గులుమూరు పంచాయతీ జగన్నాథపురంలో గిరిజనుల భూములను గిరిజనేతరులు ఆక్రమించుకున్నారని, ఈ విషయంలో తహసీల్దారు స్పందించి న్యాయం చేయాలని కోరారు. లేకుంటే గిరిజనులతో కలిసి అదే భూమిలో ఏరువాక నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం తహసీల్దారుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా గిరిజనుల సాగులో ఉన్న భూమిని గిరిజనేతరులు ఎలా స్వాధీనం చేసుకుంటారని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న, ఊలక భవాని, రుగడ నర్సయ్య, ఆదిలక్ష్మి, భీముడు తదితరులు పాల్గొన్నారు.

ఊరటనిచ్చిన వాన



ఎల్.ఎన్.పేట మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. ఉదయం నుంచి కాస్త ఎండకాసినప్పటికీ మధ్యాహ్నం తురకపేట, చింతలబడవంజ, సిద్ధంతం, కరకవలస, శ్యామలాపురం, కృష్ణాపురం తదితర ప్రాంతాల్లో మోస్తరుగా వాన పడటంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

- ఎల్.ఎన్.పేట

ఆపదలో అండగా..



కొత్తూరు పంచాయతీ కొత్తపేట కాలనీలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన కోగాన పద్మావతికి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అండగా నిలిచింది. గృహోపకరణాలతో పాటు నిత్యావసర వస్తువులను సభ్యులు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ మండల కన్వీనర్ పాగిరి రవి, పి మనోజ్, గండివలస ఆనందరావు, పి.యతిరాజులు పాల్గొన్నారు.

- కొత్తూరు

పేదల సేవలో..



అనాథలను ఆదుకోవడంలోనే సంతృప్తి ఉంటుందని పాతపట్నంకు చెందిన శిర్ల జోగారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో ఉన్న నవ జీవన్ ట్రస్ట్ ఆవరణలో అన్నలక్ష్మి ఉచిత రేషన్ ద్వారా 40 మంది నిరుపేద వితంతువులకు శిర్ల జోగారావు చేతుల మీదుగా శుక్రవారం బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వహకుడు నరసింహారెడ్డి, మేనేజర్ ఎస్.వి.రమణ, బి.గౌరీ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

- పాతపట్నం

అన్నదాతపై సాగు భారం



పొలం దుక్కికి తరలివెళుతున్న రైతన్నలు

- ఏటా పెరుగుతున్న పెట్టుబడులు
- దుక్కులు, కూలీల ఖర్చులూ ఎక్కువే
- అప్పుల కోసం రైతన్నకు తిప్పలు

ఎల్.ఎన్.పేట: ప్రతి ఏడాది పంట పెట్టుబడి పెరిగిపోతోంది. ఓవైపు విత్తనాలు, ఎరువుల ధరలు ప్రభుత్వం పెంచుకుంటూ పోతుంటే మరో వైపు దుక్కిలు, కూలీల ఖర్చులు అన్నదాతలకు భారంగా మారుతున్నాయి. పంట పెట్టుబడి కోసం అప్పులు చేయక తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విత్తనాలు చల్లే ముందు నుంచి పంట దిగుబడులు ఇంటికి వచ్చేంత వరకు అన్ని దశల్లోనూ అప్పులు చేసి పెట్టుబడి పెట్టక తప్పడం లేదని అంటున్నారు.

పెరుగుతున్న పెట్టుబడి..

గత ఏడాదితో పోల్చి చూస్తే ఈ ఏడాది విత్తనాల ధరలు పెరిగాయి. ఎరువుల ధరలు దూసుకుపోతున్నాయి. మరో వైపు ట్రాక్టర్‌తో దుక్కిలు, పొలం గట్లు బాగుచేసుకునేందుకు కూలీల ధరలు పెరుగుతున్నాయి. వేసవి నుంచి విత్తనాలు వేసుకునేంత వరకు ట్రాక్టర్ దుక్కిలు, పొలం గట్లు బాగుచేయటం, ఎరువులు, కోతలు, విత్తనాలు, పురుగుల మందులు, కలుపు నివారణ.. ఇలా అన్ని దశల్లోను వేలాది రూపాయలు ఖర్చు చేయక తప్పటం లేదని రైతులు చెబుతున్నారు.

ఎకరాకు అయ్యే ఖర్చుల వివరాలు ఇలా...	
విత్తనాలు	రూ.960 (30కిలోల ప్యాకెట్-సోనామసూరి)
ట్రాక్టర్ దుక్కికి	రూ.3,600 (మూడుసార్లు దుక్కికి)
గట్లు బాగుచేసేందుకు	రూ.1,500 (కూలీలకు)
కలుపు నివారణకు	రూ.4,500 (కూలీలు, మందులు)
ఎరువులు, పురుగుల మందులు	రూ.7,000 (డిఏపీ, యూరియా వగైరా)
కోతలు, వరి నూర్పులు	రూ.2,800 (కోత యంత్రం కోసం)



ట్రాక్టర్‌తో పొలం దుక్కి..



విత్తనాలు జల్లుతున్న రైతు

వాతావరణం అనుకూలిస్తేనే..



ప్రతీ ఏడాది పంట పెట్టుబడి పెరిగిపోతోంది. దీంతో వడ్డీలకు అప్పులు చేసి పెట్టుబడి పెడుతున్నాం. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే పంట దిగుబడి కలసి వస్తే వడ్డీతో పాటు అప్పులు తీర్చుకుంటాం. లేదంటే అప్పులు, వడ్డీలు తలకుమించిన భారమవుతున్నాయి.

– పాలక పట్టయ్య, రైతు, జంబాడ, ఎల్.ఎన్.పేట మండలం

రైతు వెన్ను విరిచిన కూటమి ప్రభుత్వం



శ్యామలరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి

జలుమూరు: కూటమి ప్రభుత్వం రైతుల వెన్ను విరిచిందని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మెజ్జాడ శ్యామలరావు అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విత్తనాలు, ఎరువులు అందక, పంటకు గిట్టు బాటు ధర రాక సీఎం చంద్రబాటు రైతుల పాలిట శాపంలా మారారని విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో రైతు పండించిన అపరాలకు కనీస మద్దతు ధర క్వింటాకు రూ.8 వేలు నుంచి రూ.9 వేలు అందేదని, నేడు క్వింటా ధర రూ.4 వేలు నుంచి రూ.5 వేలకు పడిపోయిందన్నారు. 2014–19 టీడీపీ ప్రభుత్వంలో జలుమూరులో అపరాలు కుంభకోణం జరిగిందని, నాటి మంత్రి అచ్చెన్నాయుడి ఒత్తిడి మేరకు అధికారులు తక్కువ ఉన్న వాటిని వ్యాపారులకు లాభం చేకూరేందుకు అమాంతంగా ధర పెంచారని, వీటిపై నాడు సీబీఐ కేసు కూడా నమోదు అయ్యిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి అపరాలకు కనీస మద్దతు ధర పెంచి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ

కొత్తూరు: మండలంలోని మెట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రువారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థుథ మిత్ర కిట్లను హెచ్ఎం డీఎల్ నరసింహం పంపిణీ చేశారు. పుస్తకాలతో పాటు యూనిఫాం, పలు రకాల వస్తువులు ఉన్న ఈ కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ జామి భానుమూర్తి, వైస్ చైరన్ గేదెల లక్ష్మి, కమలాకర్, దశరథ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.